క్లుప్తంగా

పృథ్వీశ్వరునికి లక్ష మల్లెల పూజ



నడకుదురు(చల్లపల్లి): నడకుదురులోని ప్రాచీన శైవ క్షేత్రం శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారికి వేద పండితులు లక్ష మల్లెల పూజ చేసి విశేష అలంకరణ, నక్షత్ర హారతి నిర్వహించారు. దేవస్థానం ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు, దేవస్థానం సమగ్ర అభివృద్ధికర్త మండవ రవీంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రివిక్రమరావు, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, మాజీ ఎంపీటీసీ లంకమ్మ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు



బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి మందిరంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉదయం మహిళా భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా రామేశ్వరుని దివ్య కల్యాణోత్సవం



టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని టేకుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ బాల పార్వతీ సమేత రామేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవం బుధవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. శ్రీ కంచి కామకోటి పీఠస్థ ఆలయమైన రామేశ్వరస్వామివారి దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములతో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేద పండితులతో సంప్రదాయబద్ధంగా స్వామివారి ఎదురుకోలు ఉత్సవం, అనంతరం వైభవోపేతంగా దివ్యకల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం వీక్షించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బుద్ధప్రసాద్‌కు రిటైర్డ్ కలెక్టర్ లక్ష్మీకాంతం అభినందన



అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌ను రిటైర్డ్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం బుధవారం అభినందించారు. బుద్ధప్రసాద్ నివాసానికి విచ్చేసిన లక్ష్మీకాంతం ఆయనను కలుసుకుని ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నాలుగవసారి శాసనసభ్యునిగా గెలుపొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతం కుటుంబ సభ్యులతో పాటు బుద్ధప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీసమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏరాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామికి విశేష అలంకరణ చేశారు. ఆలయంలోని శివసాధంలో స్వామికి శాంతి కల్యాణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పర్యవేక్షణలో పూజలు చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో ఎం.గంగాధర రావు, భక్తులు పాల్గొన్నారు.

ఆ రహదారిపై ప్రయాణం ప్రాణాంతకం

- ప్రమాదభరితంగా కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనాలు
- తాజాగా కాలువలోకి దూసుకువెళ్లిన కారు



వి.కొత్తపాలెం-జయపురం మధ్య పైకి లేచిన కంకర రాళ్లు

కోడూరు: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి ప్రమాదభరితంగా మారింది. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన రహదారి నిర్మాణాన్ని ప్రారంభించింది. సుమారు రూ.16.80 కోట్ల నిధులను కూడా రహదారి నిర్మాణానికి కేటాయించింది. కోడూరు నుంచి అవనిగడ్డ వరకు 13 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు పనులు చకచకా నిర్వహించారు. ఎన్నికల కోడ్ కొనసాగుతున్నప్పటికీ రహదారి నిర్మాణం ఆపకుండా పనులు చేస్తూ వచ్చారు. సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర రెండు లేయర్లలో వెట్ మిక్స్‌ను కూడా వేసి రహదారికి ఇరువైపులా మార్జిన్స్‌ను పెంచారు. సుమారు రెండు నెలల పాటు పనులు నిరాటంకంగా కొనసాగాయి. అయితే ఇటీవల రహదారి నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు రావడంతో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. 15 రోజుల నుంచి పనులు పూర్తిగా ఆగిపోగా, వేసిన వెట్ మిక్స్ కూడా పైకి లేచిపోతోంది. వెట్ మిక్స్‌లో ఉండే కంకర రాళ్లు పైకి లేవడంతో ప్రస్తుతం రహదారి ప్రమాదభరితంగా మారింది. కృష్ణాపురం నుంచి మాచవరం వరకు రాళ్లు పైకి లేచి ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాటరింగ్ కూడా చేయకపోవడంతో గాలికి దుమ్ము, ధూళి మొత్తం పైకి లేచి వాహనదారులను కమ్మేస్తోంది. భారీ వాహనం వెనుక భాగంలో ద్విచక్ర వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

గణనీయంగా పెరిగిన ప్రమాదాలు

రహదారిపై కంకరరాళ్లు పైకి లేచిపోవడంతో ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. గత 15 రోజుల వ్యవధిలోనే మూడు కార్లు, 108 అంబులెన్స్ వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న ఇళ్లలోకి దూసుకువెళ్లడం, కాలువలోకి పల్టీకొట్టడం జరిగాయి. ప్రస్తుతం కాలువలో నీరు లేకపోవడంతో పెను ప్రమాదాలు తప్పాయి. రాళ్లు పైకి లేచిపోవడంతో వాహనాలు స్కిడ్ అయి అదుపు తప్పుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు.

కాలువలోకి దూసుకువెళ్లిన కారు

తాజాగా బుధవారం ఓ కారు కోడూరు ప్రధాన పంట కాలువలోకి దూసుకువెళ్లింది. జయపురం సమీపంలో కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. అవనిగడ్డ వైపు నుంచి కోడూరుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే కారులోని వారంతా సురక్షితంగా బయట పడ్డారు. అధికారులు స్పందించి నిలిచిన రహదారి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వాటరింగ్ లేకపోవడంతో వాహనాలు వెళ్తున్నప్పుడు పైకి లేస్తున్న దుమ్ము, ధూళి



బుధవారం కాలువలోకి దూసుకువెళ్లిన కారు

బందరు ప్రజలకు పేర్ని కిట్టు కృతజ్ఞతలు

గెలుపొందిన కొల్లు రవీంద్రకు అభినందనలు



పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని, చిన్న వయసులోనే ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన తనకు నియోజకవర్గ ప్రజలు అండగా నిలబడి 50,800 మంది తమ ఓటుతో తనను బలపరచటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ అరంగేట్రం చేసిన నాటి నుంచి గడిచిన నాలుగున్నర ఏళ్లుగా కోవిడ్ సమయంలో బాధితులకు అందించిన సేవలకే గానీ, పేదవాళ్ల కష్టాల్లో పాలు పంచుకున్నందుకే గానీ, లేదంటే ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉన్నందుకు గానీ ఎన్నికలలో నియోజకవర్గం నుంచి దాదాపు 50,800 మంది తనను బలపరుస్తూ ఓటు వేయడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై అభిమానంతో వేసిన ప్రతి ఓటును ఇప్పటి వరకు తన కోసం కష్టపడిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు అంకితం చేస్తున్నానన్నారు. తాను ఓటమిపాలైనా పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానని ఈ విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ వాళ్ల కవ్వింపు చర్యలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడా, ఎలాంటి ఆవేశాలకు గురి కావద్దని చెప్పారు. బందరు శాసనసభ్యుడిగా గెలుపొందిన కొల్లు రవీంద్రకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో ప్రజలకు కూటమి ఇచ్చిన ప్రతి హామీని అమలుపరచేందుకు కృషి చేయాలని కోరారు. మచిలీపట్నంలో మెడికల్ కళాశాల నిర్మాణం దాదాపు పూర్తి కాగా బందరు పోర్టు నిర్మాణ పనులు మరింత చురుగ్గా సాగేందుకు కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచటంలో విఫలం అయితే ప్రజల పక్షాన కచ్చితంగా ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉంటానని చెప్పారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న బెల్ రిటైర్డ్ అడిషనల్ జనరల్ మేనేజర్ డీకేఆర్‌కే రవిప్రసాద్ తదితరులు

మచిలీపట్నంటౌన్: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కేఎస్‌హెచ్ బాయ్స్ హాస్టల్ ఆవరణలో బెల్ కంపెనీ రిటైర్డ్ అడిషనల్ జనరల్ మేనేజర్ డీకేఆర్‌కే రవిప్రసాద్ మొక్కలు నాటారు. హైనీ హైస్కూల్ ప్రాంగణంలో కూడా జవాన్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారులు షరీఫ్, సుజాత, హైనీ సంస్థల అధ్యక్షుడు లింగం మోజెస్, నోబుల్ సంస్థల కోశాధికారి మునీలాల్, మైత్రి ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, అధ్యక్షుడు వేణుకుమార్, ఫౌండేషన్ సభ్యులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) సంస్థ ఆధ్వర్యంలో గిలకలదిండిలోని మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి కె.సుధారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో జనసేనదే పైచేయి

- అవనిగడ్డ మండలంలో అత్యధికంగా 10,200 మెజారిటీ
- అత్యల్పంగా ఘంటసాలలో 4,830 ఆధిక్యం



అవనిగడ్డలోని మూడు బొమ్మల సెంటర్

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జనసేన పార్టీ సత్తా చాటింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు కంటే జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్ని మండలాల్లో పైచేయి సాధించారు. అవనిగడ్డ మండలంలో వైఎస్సార్‌సీపీ కంటే జనసేన పార్టీకి అత్యధికంగా 10,200 మెజారిటీ రాగా, ఘంటసాల మండలంలో అత్యల్పంగా 4,830 మెజారిటీ వచ్చింది. అవనిగడ్డ మండలంలో జనసేన అభ్యర్థి బుద్ధప్రసాద్‌కు 18,188 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రమేష్ బాబుకి 7,988 ఓట్లు వచ్చాయి. ఈ మండలంలో జనసేన 10,200 మెజారిటీ సాధించింది. నాగాయలంక మండలంలో జనసేనకు 20,409 ఓట్లు పోలవగా, వైఎస్సార్‌సీపీకి 12,632 ఓట్లుతో జనసేనకు 7,777 మెజారిటీ లభించింది. కోడూరు మండలంలో జనసేనకు 19,042 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీకి 11,468 ఓట్లతో 7,579 మెజారిటీ, మోపిదేవి మండలంలో జనసేనకు 15,893 ఓట్లు, వైఎస్సార్‌సీపీకి 8,814 ఓట్లతో 7,074 మెజారిటీ, చల్లపల్లి మండలంలో జనసేనకు 20,758 ఓట్లు, వైఎస్సార్‌సీపీకి 13,641 ఓట్లుతో 7,117 మెజారిటీ, ఘంటసాల మండలంలో జనసేన పార్టీకి 16,329 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీకి 11,499 ఓట్లు వచ్చాయి. ఈ మండలంలో జనసేనకు 4,830 ఓట్ల ఆధిక్యత లభించింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జనసేనకు 1,10,619 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీకి 66,042 ఓట్లు వచ్చాయి. దీంతో జనసేన పార్టీ 44,577 భారీ మెజారిటీ సాధించింది.

ఎదురుమొండి దీవుల్లో స్వల్ప ఆధిక్యత

నాగాయలంక మండలంలో రహదారి సౌకర్యం లేని కృష్ణానదీ పాయల నడుమ ఉన్న ఎదురుమొండి దీవుల్లో జనసేన స్వల్ప ఆధిక్యత కనబరచింది. ఎదురుమొండి దీవుల్లోని ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బలో జనసేన పార్టీకి మొత్తం 2,245 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీకి 1,783 ఓట్లు వచ్చాయి. దీంతో జనసేన పార్టీ 462 స్వల్ప ఆధిక్యత సాధించింది. ఈ దీవుల్లోని ఎదురుమొండిలో జనసేనకు 583 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీకి 459, గొల్లమందలో జనసేనకు 467, వైఎస్సార్‌సీపీకి 298, నాచుగుంటలో జనసేనకు 536, వైఎస్సార్‌సీపీకి 357, ఈలచెట్లదిబ్బలో జనసేనకు 412, వైఎస్సార్‌సీపీకి 425, కృష్ణాపురంలో జనసేనకు 247, వైఎస్సార్‌సీపీకి 234 ఓట్లు వచ్చాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో 6వ తేదీ గురువారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ మండల ఏఈ పాండురంగారావు తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ

మోపిదేవి: బీసీ గురుకులాల్లో వివిధ కేటగిరీల్లో బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీర రవి బుధవారం తెలిపారు. ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులు 6,7,8,9 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య కాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 20వ తేదీ పరీక్ష నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు.

బాలబాలికలకు క్రాఫ్ట్ పోటీలు

చల్లపల్లి: బాలబాలికల్లో సృజనాత్మకత పెంచాలని గ్రంథాలయ అధికారి కె.గణేష్ కుమార్ కోరారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పురస్కరించుకుని బుధవారం పిల్లలకు క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. పిల్లలు ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేశారు. పిల్లలతో పాటలు పాడించి కథలు చెప్పించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పమిడిముక్కల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన 94 పనుల్లో 4,190 మంది కూలీలు పాల్గొన్నారు. పంట కాలువల, చెరువుల తవ్వకం పనులు జరుగుతున్నాయని ఈసీ కిరణ్‌కుమార్ తెలిపారు.

రూ.1.66 లక్షలు పలికిన ఆంజనేయస్వామి లడ్డు



ఆంజనేయస్వామివారి లడ్డుతో రాము కుటుంబ సభ్యులు

కృత్తివెన్ను: శ్రీఅభయాంజనేయస్వామివారి హనుమజ్జయంతి ఉత్సవాలు సందర్భంగా బుధవారం మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో నిర్వహించిన వేలం పాటలో స్వామివారి లడ్డు ప్రసాదం రూ.1.66 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన ప్రత్తి రామాంజనేయులు (రాము) వేలంలో రూ.1.66 లక్షలకు హెచ్చు పాటదారునిగా నిలిచి లడ్డును కైవసం చేసుకున్నారు. గతేడాది రూ.81 వేలు పలుకగా ఈ ఏడాది రెట్టింపు ధరకు రాము పాట పాడుకున్నారు. దాదాపు జిల్లాలోనే అత్యంత ధర పలికిన లడ్డు ఇదేనని నిర్వాహకులు తెలిపారు. రాముతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కమిటీ వారు ఘనంగా సత్కరించారు.

ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

గత ఐదు రోజులుగా మండలంలోని గాంధీనగరం గ్రామంలో జరుగుతున్న శ్రీహనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు ఎంతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, తమలపాకులు, సింధూరార్చనలు జరిపారు. బుధవారం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని సమారాధనలో పాల్గొన్నారు.

ఎస్పీ బాలు గీతాలు అజరామరం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు పద్మశ్రీ డాక్టర్ శ్రీపాద పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాలు) స్వరం చిరస్మరణీయమని, ఆయన స్వరం నుంచి వెలువడిన గీతాలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాల్‌లో నిర్వహించిన దశకంఠుడు ఎస్పీ బాలు స్వరాభిషేకం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఎస్పీ బాలు గానం చేసిన పలు గీతాలను ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీలతో పాటు పలువురు గాయనీ గాయకులు శ్రావ్యంగా ఆలపించారు.

గాన గంధర్వుడు ఎస్పీ

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సినీ రంగంలో అనేక మంది ప్రముఖ హీరోలకు వారి గొంతులకు అనుగుణంగా పాటలు పాడిన బాలును సినీ ప్రియులు మరిచిపోలేరన్నారు. కేవలం సినీ గీతాలే కాకుండా అనేక ఆధ్యాత్మిక గీతాలు, కీర్తనలను నేటికి భక్తుల మనసుల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. సినీ రచయిత వేటూరి గీతాలపై పరిశోధన చేసిన డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ వేటూరి వంటి ఎందరో మహానుభావులు రచించిన పాటలకు ప్రాణం పోసిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తరువాత ఆ స్థానాన్ని భర్తీ చేసిన ఎస్పీ బాలును గాయక లోకం మరిచిపోదన్నారు.

విద్యార్థులతో పుస్తక పఠనం



కొడాలి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కొడాలి(ఘంటసాల): విద్యార్థులకు విద్యతో పాటు ఆటపాటలతో మానసిక ఉల్లాసం ఉండాలని లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. నీతి కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు పాటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు.

మొక్కలు నాటిన న్యాయమూర్తి



బంటుమిల్లి కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి

బంటుమిల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం.భాస్కరరావు బుధవారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ సభ్యులతో కలసి మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులు అంతరించిపోవడం, సముద్రాలు, నదుల్లో ప్లాస్టిక్ వ్యర్థాల కలుషితంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యాళ్ల శ్యాంబాబు, పళ్లెం వెంకటేశ్వరరావు, యిల్లూరి రాయుడు, అలేఖ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు గడ్డివాముల దగ్ధం



పిండివారిపాలెంలో గడ్డివామిపై పిడుగుపడి రేగిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

గూడూరు: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మండలంలోని కంకటావలో కరిమికొండ రత్నప్రసూనాంబకు చెందిన వరిపొలంలో ఉన్న 10 ఎకరాల గడ్డివామి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. బందరు అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రమాదంలో రూ.75వేల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మండలంలోని పిండివారిపాలెంలో సాయంత్రం పిడుగుపడటంతో పోసిన ఏసుబాబు అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధం అయింది. మచిలీపట్నం అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో దాదాపు రూ.70వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు.



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరుకు చెందిన మహాదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు బుధవారం సాయంత్రం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం మామిడాల పావని పర్యవేక్షణలో సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హరిణి, హేమ, వివక్ష, లాస్య, దుర్గా, జయలక్ష్మిల శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

12న ఆలయ భూముల కౌలు వేలం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠం అమృతేశ్వరస్వామి ఆలయానికి చెందిన చేపలచెరువు భూముల కౌలు బహిరంగ వేలం పాటలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి పీవై నాయుడు బుధవారం తెలిపారు. బావాజీ మఠానికి చెందిన 21.08 ఎకరాల చేపల చెరువు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ చెరువుకు మఠం వద్ద 12న వేలం పాటలు జరుగుతాయన్నారు. ఇదే మఠానికి చేవూరులో 5.40 ఎకరాల పల్లం భూమి ఉన్నట్లు తెలిపారు. దీనికి 12 మధ్యాహ్నం చేవూరు సచివాలయం వద్ద వేలం పాటలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా అమృతేశ్వరస్వామి ఆలయానికి మండలంలోని చేవూరులో 10.79 ఎకరాల పల్లంభూమి ఉన్నట్లు తెలిపారు. దీనిని ఏడాది పాటు లీజుకు ఇచ్చేందుకు చేవూరు సచివాలయం వద్ద 12న మధ్యాహ్నం వేలం పాటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సింగరాయపాలెం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి సింగరాయపాలెంలో నాలుగు ఎకరాలు చేవూరులో 15.74 ఎకరాల పల్లం భూమి ఉందని పేర్కొన్నారు. ఈ భూములకు సైతం సింగరాయపాలెం స్వామి వారి ఆలయం, చేవూరు పంచాయతీ కార్యాలయం వద్ద 12న వేలం పాటలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తగిన దరావత్తు చెల్లించి పాటల్లో పాల్గొనాలని కోరారు.